క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజలు



నాణేలతో ప్రత్యేకంగా అలంకరించిన లక్ష్మీదేవి

ఆత్రేయపురం: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి పూజలు నిర్వహించారు. మహిళలు వేకువజామునే గౌతమీ, వశిష్టా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, ఆత్రేయపురం లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన లక్ష్మీదేవిని నాణేలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో కొలువైన నూకాంబిక అమ్మవారి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు జరిగాయి. మూడో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజు చౌదరి, జేఏ డి.భాస్కర్ శ్రీనివాసు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులకు ఉచితంగా పూజా ద్రవ్యాలు అందజేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళ భక్తులు విచ్చేసి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

నేడు వైద్యశిబిరం

కొత్తపేట: సంతాన లేమి, స్త్రీ వ్యాధులకు సంబంధించి రావులపాలెంలోని సత్యసాయి సేవాకేంద్రంలో కొత్తపేట భాస్కర ఐవీఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్ సౌజన్యంతో శనివారం వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2 గంటలకూ శిబిరం జరుగుతుందని సేవా కేంద్రం కో ఆర్డినేటర్ మన్యం వర్ధనరావు తెలిపారు. ప్రముఖ గైనకాలజిస్టు, ఐవీఎఫ్ ఫెర్టిలిటీ స్పెషలిస్టు డాక్టర్ ప్రదీప్తి కరుణ వైద్యసేవలు అందిస్తారన్నారు. ఆయా సమస్యలతో బాధపడుతున్న మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి 'వేగేశ్న' సేవలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి వేగేశ్న ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తామని ఆ సంస్థ అధినేత అనందరాజు తెలిపారు. ఆయన శుక్రవారం స్వామి వార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి తమ ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం



సతీష్ భార్యకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మామిడికుదురు: రియాక్టర్ పేలుడులో మృతి చెందిన పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ కుటుంబానికి అండగా ఉంటామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరు చేసిన రూ.కోటి చెక్కును మృతుని భార్య వెంకటనాగమణికి శుక్రవారం ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదంలో సతీష్ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. అతని కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సతీష్ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, పార్టీ నేతలు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కోలా సత్యనారాయణ, అడ్డాల ఆదినారాయణ, చెరుకూరి సత్తిబాబు, మంచాల శ్రీను, బొరుసు రత్తయ్యకాపు ఉన్నారు.

స్వగ్రామం చేరిన సతీష్ మృతదేహం

మామిడికుదురు: అచ్యుతాపురం ఎసెన్షియా సెజ్‌లోని రియాక్టర్ పేలుడులో దుర్మరణం చెందిన పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. రాత్రి ఒంటి గంట సమయంలో మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. దీంతో సతీష్ స్వగ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. సతీష్ మృతదేహం వద్ద భార్య సాయిశ్రీనాయకి దుర్గారామవెంకటనాగమణి, తల్లి పద్మావతి, తండ్రి శ్రీనివాసరావు తీవ్రంగా విలపించారు. ఉన్న దిక్కును కోల్పోయామని, ఇక తమకు దిక్కెవరంటూ కన్నీరు మున్నీరయ్యారు. స్థానిక శ్మశానవాటికలో సతీష్ అంత్యక్రియలు నిర్వహించారు. కాగా రెవెన్యూ అధికారులు రూ.కోటి చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.



మహిళా సిబ్బంది భద్రతకు చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి. రాత్రిపూట విధులు నిర్వహించే వారిలో నెలకొన్న అభద్రతాభావాన్ని తొలగించాలి. మహిళా ఉద్యోగుల అవసరాలను గుర్తించి తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలి. పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– జి.సంతోషిణి, ఎంఎల్‌హెచ్‌పీ, పొదలాడ, తాటిపాక పీహెచ్‌సీ



మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాలి

ఆరోగ్యశాఖలో ఆస్పత్రుల వద్ద విధులు నిర్వహించే వారితో పాటు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు రక్షణ కరువైంది. విధి నిర్వహణలో ఉన్న వారిపై ఎలాంటి దాడి జరిగినా వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. వైద్యులు, నర్సులు, ఫీల్డ్‌స్టాఫ్‌కు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు నిర్వహించి మానసిక ధైర్యాన్ని పెంచాలి.

– నేతల మేరికుమారి, ఆశా వర్కర్స్ నాయకురాలు, తాటిపాక



రెట్టింపు సరే.. అమలయ్యేదెన్నడో..

- రెండు నెలలుగా పరిహారం కోసం మత్స్యకారుల ఎదురుచూపులు
- భృతి అందక అవస్థలు

సఖినేటిపల్లి: వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే భరోసా సొమ్మును రూ.20 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అమలుకై వారంతా ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేట నిషేధ సమయం ముగియడానికి ముందే వారి వ్యక్తి గత ఖాతాలోకి నిధులు మంజూరయ్యేవి. అయితే గడువు ముగిసి రెండు నెలలు పైబడి కావస్తున్నా రూ.20 కూడా వారి వ్యక్తిగత ఖాతాలకు జమ కాకపోవడంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

వేట నిషేధ కాలం..

ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15వ తేదీ అర్ధరాత్రి వరకు సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తున్నారు. ఈ సమయంలో సముద్రంలో చేపలు గుడ్లు పెట్టి పొదగడం ద్వారా మత్స్య సంపద వృద్ధి చెందుతుందని గుర్తించి వేట నిషేధం అమలు చేయడం పరిపాటిగా మారింది. ఈ సమయంలో మత్స్యకారులు ఎవరూ సముంద్రలోకి వెళ్లి వేట సాగించేందుకు వీలుకాదు. నిషేధ కాలంలో ఒక్కో మత్స్యకారుడికి గత ప్రభుత్వం రూ.10 వేలు మత్స్యకార భృతి అందజేసేది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మత్స్యకారులకు ఇప్పటి వరకూ మత్స్యకార భరోసా పథకం కింద అందిస్తున్న లబ్ధిని చంద్రబాబు ప్రభుత్వం రెట్టింపు చేసి రూ.20 వేలు ఇస్తామని నమ్మబలికింది.



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో బోటు నుంచి చేపలు దిగుమతి చేస్తున్న మత్స్యకారులు

రాజోలు దీవిలో.....

రాజోలు దీవిలో విస్తరించి ఉన్న తీరంలోని వివిధ గ్రామాల్లో సముద్రం వేటపై ఆధారపడి ఎక్కువ మంది జీవనం సాగిస్తున్నారు. అంతర్వేది, పల్లిపాలెం, గొంది, రామరాజులంక, రాజోలు, కరవాక, గోగున్నమఠం తదితర గ్రామాల్లో 1380 మంది మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో కూటమి పెంచిన రెట్టింపు ఆర్థిక సాయం రూ.20 వేలు చొప్పున వారికి అందాల్సి ఉంది.

భృతి చెల్లింపులు ఇలా...

రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకూ ఉన్న టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట నిషేధ సమయంలో ఇవ్వాల్సిన పరిహారాన్ని పంపిణీ తీవ్ర జాప్యం ప్రదర్శించేది. ఒక్కొక్కరికీ రూ.4 వేలు చొప్పున ఇవ్వడానికి మీనమేషాలు లెక్కించేది. అయితే 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక సముద్రంపై చేపల వేట నిషేధ కాలంలో అర్హతగల మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచింది. ఏటా క్రమం తప్పకుండా మే 15వ తేదీ నాటికి డీబీటీ ద్వారా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసేది. నిషేధ సమయంలోనే ఇవ్వాల్సిన పరిహారాన్ని గతంలో ఎప్పుడూ ఏ ప్రభుత్వం ఇవ్వని రీతిలో మాజీ సీఎం జగన్ వారి వ్యక్తి గత ఖాతాలకు పెంచిన మొత్తాన్ని ఒకే పర్యాయం జమ చేయడం చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కి నెలలు గడుస్తున్నా రూ.20 కూడా వారి ఖాతాలకు అందకపోవడంతో మత్స్యకారులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

ప్రభుత్వానికి జాబితా అందజేశాం

తమ పరిధిలోని వేట విరామం లబ్ధిదారుల జాబితా ప్రభుత్వానికి అందజేశాం. మొత్తం వేట బోట్లు 230కి గాను బోటుకు ఆరుగురు చొప్పున 1380 మందిని జాబితాలో పొందుపరిచాం. ప్రభుత్వం వద్ద లిస్ట్ పెండింగ్‌లో ఉంది. దీనిపై తగిన ఉత్తర్వులు కోసం చూస్తున్నాం.

– సిద్ధార్థ వర్ధన్, ఫిషరీస్, ఏడీ, రాజోలు

మత్స్యకారులకు భరోసా జాడలేదు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు సకాలంలో మత్స్యకార భరోసా అందింది. ప్రస్తుత ప్రభుత్వంలో ఇంత వరకూ ఆ జాడేలేదు.

– వనమాలి ఆదినారాయణ, పల్లిపాలెం

పెంచిన భృతి పంపిణీ చేయాలి



గత ప్రభుత్వం పరిహారం పంపిణీ చేసినంత వేగవంతంగా ఇప్పటి ప్రభుత్వం కూడా పంపిణీ చేయాలి. రెట్టింపు చేసిన మొత్తాన్ని పంపిణీ చేసి మా కష్టాలు తీరేటట్లు ప్రభుత్వం చూడాలి.

– వనమాలి నరసింహస్వామి, పల్లిపాలెం

ఆంధ్రకేసరికి ఘన నివాళులు



రావులపాలెం డిగ్రీ కళాశాలలో టంగుటూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



టంగుటూరికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

రావులపాలెం: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జయంతిని ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక మహాత్మాగాంధీ విద్యా సంస్థల్లో కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ పీఎస్ రాజు తదితరులు టంగుటూరి చిత్రపటానికి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీవీఆర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలో వివిధ పాఠశాలల్లో టంగుటూరి ప్రకాశం జయంతి ఘనంగా నిర్వహించారు. అంతర్వేదిపాలెం మధ్య గ్రూపు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జె.కనకలింగేశ్వరరావు అధ్యక్షతన, అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పి.సోమసూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు.

అంబాజీపేట: ప్రకాశం పంతులు ఆంధ్రజాతికి ఎంతో త్యాగం చేశారని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు.

బంగారు తాడు అపహరణ

అంబాజీపేట: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయానికి వెళ్లి రాత్రి సమయంలో ఇంటికి తిరిగివస్తుండగా ఓ మహిళ మెడలో నుంచి బంగారు తాడు, నల్లపూసల తాడును మోటార్ సైకిల్‌పై ఇరువురు వ్యక్తులు వచ్చి అపహరించుకుపోయారు. గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెంది గ్రంధి మహాలక్ష్మి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో స్థానిక శివాలయానికి వెళ్లి ఇంటికి వెళుతుంది. ఈ సమయంలో ప్రధాన వీధిలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆ మహిళ మెడలో ఉన్న బంగారు తాడు, నల్లపూసలను లాక్కుని వెళ్లిపోయారు. ఆ మహిళ తాడు, నల్లపూసలను చేతితో గట్టిగా పట్టుకోవడంతో ఆమె చేతిలో రెండు ముక్కలు తెగిపోయాయి. సగ భాగంగా ఉన్న తాడు, నల్లపూసలను పట్టుకుని వ్యక్తులు పరారయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు పొలగుమ్మి రోడ్డులో వెళ్లిపోయినట్టు బాధితురాలు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై కె.చిరంజీవి, పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్మీపతి సేవలు చిరస్మరణీయం

రాజోలు: ఇటీవల మృతి చెందిన సీనియర్ న్యాయవాది విన్నకోట లక్ష్మీపతి (71) సేవలు చిరస్మరణీయమని రాజోలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబు అధ్యక్షతన లక్ష్మీపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత కోర్టు హాలులో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందుతో పాటు పలువురు సీనియర్ న్యాయవాదులు లక్ష్మీపతి మృతికి సానుభూతి వ్యక్తం చేస్తూ మౌనం పాటించారు. రాజోలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొల్లమందల స్టాలిన్, ఏజీపీ యర్రంశెట్టి అయ్యప్పనాయుడు, న్యాయవాదులు పీవీ కృష్ణంరాజు, పొన్నాడ సూర్యారావు, మైలవరపు రవిరామ్, ఆకుల భాస్కరరావు, కోట సుధాకర్, చింతా ప్రసాద్, మామిడిశెట్టి శ్రీనివాసరావు, సత్తిరాజు స్వామి తదితరులు నివాళులర్పించారు.



లక్ష్మీపతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్నన్యాయవాదులు

సంపూర్ణ పారిశుధ్యంతో వ్యాధుల నివారణ

ఆలమూరు: గ్రామాల్లో ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించడం ద్వారా సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించి, అంటువ్యాధులను నియంత్రించవచ్చని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ సూచించారు. డ్రై డే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. ఇలా చేయడం వల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశా సిబ్బంది డ్రై డేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. అంటువ్యాధుల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.



మూలస్థాన అగ్రహారంలో డ్రైడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి

ఆలమూరు: గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు, అభివృద్ధిపై సలహాలను స్వీకరించేందుకు రికార్డు స్థాయిలో గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, డిప్యూటీ తహసీల్దార్ కె.విజయరేఖ తెలిపారు. మండల రెవెన్యూ, పంచాయతీరాజ్, ట్రాన్స్‌కో, విద్యాశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు జరిగాయి. ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించిన సమావేశాల్లో 2024–25లో ఎన్ఆర్‌జీఈఎస్ ద్వారా చేపట్టవలసిన పనులపై గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో గుర్తించిన పనులు ఆధారంగా రెండో విడత నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు.

రావులపాలెం: మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో ఉపాధి గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. గ్రామాల వారీగా 2024–25లో చేపట్టనున్న పనులపై చర్చించారు. అలాగే ఉపాధి కల్పన, చేపట్టే పనులు వాటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలోని 10 గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయా గ్రామాల్లో గ్రామ సర్పంచుల అధ్యక్షతన జరిగిన గ్రామ సభల్లో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు. దీనిలో భాగంగా సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, పంట కాలువలు, శ్మశాన వాటికలు అభివృద్ధి, ఉద్యానవన పనులు ప్రతిపాదించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పాల్గొన్న వానపల్లి గ్రామ సభలో వివిధ పనులకు సంబంధించి రూ.10.20 కోట్లకు ప్రతిపాదించారు. అలాగే మిగిలిన 9 గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు వివిధ పనులను గ్రామ సభల దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై చర్చించి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాలని తీర్మానించారు.



పినపళ్లలో నిర్వహించిన గ్రామ సభలో ప్రసంగిస్తున్న సర్పంచ్ సుభాష్

ఆత్రేయపురం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. బొబ్బర్లంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీడీఓ నాతి బుజ్జి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో 2024–25లో కొత్తగా చేపట్టే ఉపాధి పనుల ప్రతిపాదనలను వివరించారు. సభల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు మేలు చేసే విధంగా పనులు నిర్వహిస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఊడిమూడిలో సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్న కుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల కోసం అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించామని అన్నారు. అధికారులు పాల్గొన్నారు.



అప్పనరామునిలంకలో సమస్యలను నోట్ చేసుకుంటున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ గ్రామ సభల ద్వారా మెరుగైన ఫలితాలు ఉంటాయని ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కత్తిమండలో జరిగిన గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఉపాధి పథకం ద్వారా గ్రామాల్లో నిర్వహించాల్సిన పనులను గుర్తించి నమోదు చేశారు. అధికారులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో శాశ్వత ప్రాతిపదికన పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణానికి కార్యాచరణ చేపట్టాలని శుక్రవారం జరిగిన ప్రత్యేక గ్రామసభలో తీర్మానాలు చేశారు. మండలంలోని 18 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో రూ.2 కోట్లు, రాజోలు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో రూ.కోటి నిధులతో ప్రతిపాదనలు పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశించారని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

అంబాజీపేట: మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన గ్రామ సభ శుక్రవారం జరిగింది. గ్రామానికి సంబంధించి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించి వివరాలను ఉపాధి హామీ పథకం అధికారి వివరిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. గ్రామ సభ నిర్వహించకుండా ముందస్తుగానే రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు ఎలా సిద్ధం చేశారని స్థానిక నాయకులు అధికారులను నిలదీశారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులకు తీర్మానాలు చేశారు.



రావులపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్

సఖినేటిపల్లి: మండలంలో ఉపాధిహామీ పథకంలో గుర్తించవలసిన వివిధ పనులపై ఆయా శాఖల అధికారులు పంచాయతీల వద్ద శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. వీవీమెరక పంచాయతీ వద్ద ఎంపీడీవో పీపీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి ఎన్ఆర్‌కే రాజు పనులను వివరించారు. ఈ సందర్భంగా వారు గుర్తించ వలసిన పనులపై సమీక్షించారు. సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని అప్పనరాముని లంకలో గ్రామ సభ జరిగింది సభకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ హాజరయ్యారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగిలిన సీట్లు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ టి.లలితకుమారి శుక్రవారం తెలిపారు. ఐదో తరగతిలో 39, ఆరో తరగతిలో 11 సీట్లతోపాటు ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూపులో ఐదు, బైపీసీ గ్రూపులో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 27వ తేదీ లోగా ఆసక్తి గల విద్యార్థులు విద్యార్హత పత్రాలతో కూడిన దరఖాస్తును ఉదయం 10 గంటలకు పాఠశాల కార్యాలయం వద్ద అందించాలన్నారు. వచ్చిన దరఖాస్తులను దృష్టిలో ఉంచుకుని లాటరీ ద్వారా మధ్యాహ్నం 2 గంటలకు సీట్లు కేటాయిస్తామన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి గ్రామ సచివాలయం వద్ద చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం జిల్లా సంస్థ జోనల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం జిల్లా లింక్ వర్కర్ వై.ఏసుకుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో మార్పుతో అవస్థలు

మలికిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్ల పంపిణీలో వచ్చిన మార్పుల వల్ల లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు పేర్కొన్నారు. లక్కవరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్లు తీసుకునే వారికి రెండు నెలలు తీసుకోకపోయినా మూడో నెలలో మొత్తం మూడు నెలలకు కలిపి పింఛన్లు ఇచ్చేవారని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పద్ధతిని రద్దు చేయడంపై గోపాలకృష్ణంరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 64 లక్షల 82 వేల మంది పింఛన్లు తీసుకుంటున్నారని, రాష్ట్రంలో సర్వే చేయించి అర్హులైన కొత్తవారికి కూడా పింఛన్లు మంజూరు చేసి వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

మొక్కల సంరక్షణే పర్యావరణ పరిరక్షణ

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా గంగలకుర్రులో పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యవేణి అధ్యక్షతన శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాన నరేంద్రమోదీ చేపట్టిన ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పర్యవరణ పరిరక్షణ అందరిబాధ్యతగా గుర్తించలన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం



రాకెట్ నమూనాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మలికిపురం: జాతీయ అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశం సాధించిన విజయాలను మలికిపురం మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద స్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా తమ చిట్టి చేతులతో చిన్ని చిన్ని రాకెట్లను తయారు చేసి ఎస్ఎల్‌వీఎస్, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ అంటూ అంతరిక్ష ప్రయోగాల నమూనాలను ప్రదర్శించారు. అంతరిక్ష పరిశోధనలపై వారి ఆసక్తిని చూపారు. కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థిని ఆర్.నేహశ్రీ భారత అంతరిక్ష చరిత్రను చక్కగా వివరించి అంతరిక్ష పరిశోధన ఆసక్తిని చూపింది. కరెస్పాండెంట్ పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల కృషి అంకితభావాన్ని ఈ శుభదినం గుర్తు చేసిందన్నారు. చంద్రుడి దక్షిణధ్రువం దగ్గర వ్యోమనౌకను దింపిన ఘనత ప్రపంచంలో తొలిసారిగా భారతదేశానికే దక్కిందని, అయినప్పటికీ అమెరికా, ఐరోపా సమాఖ్య (ఈయూ), చైనాలకు దీటుగా నిలవాల్సి ఉందని దానికి మీరే కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థుల జై భారత్, జై ఇస్రో నినాదాలు చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.